సాక్షి
పల్నాడు

బుధవారం । 3 । జూలై । 2024



మొక్కలు నాటే కార్యక్రమం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



విత్తన దుకాణాల తనిఖీ

ఫిరంగిపురం: ఎరువులు, పురుగుమందులు, విత్తన విక్రయ దుకాణాలను మంగళవారం ఏవో వానంతి తనిఖీ చేశారు. ఐదు లక్షల ఖరీదైన విత్తనాల విక్రయం నిలిపివేశారు.

ఘనంగా హరిద్ర శృంగారార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగారార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

అమరేశ్వరుని హుండీ ఆదాయం రూ.22.77 లక్షలు



అమరావతి: అమరావతిలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత శ్రీ అమరేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. గత మూడు నెలలుగా హుండీల ద్వారా వచ్చి ఆదాయాన్ని లెక్కించారు. దేవదాయశాఖ పరిశీలకుడు వెంకటశ్రీనివాస్ సమక్షంలో దేవాలయంలో ఉన్న 10 హుండీలను తెరచి అందులో ఉన్న నగదును భక్తులచే లెక్కించారు. లెక్కింపు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి గోపినాధ శర్మ మాట్లాడుతూ హుండీల ఆదాయం రూ.21,10,619, అన్నదానం హుండీ ద్వారా రూ.1,66,896 మొత్తం రూ.22,77,515 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. నగదు మొత్తాన్ని వివిధ బ్యాంకులలో ఉన్న దేవాలయ ఖాతాకు జమ చేస్తున్నామన్నారు. లెక్కింపు కార్య క్రమంలో నరసరావుపేట, విజయవాడ, గుంటూరు, జగ్గయ్యపేట సేవా సమితుల సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్య ఫలితాలలో జిల్లాకు 3, 9 స్థానాలు

డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జూన్‌లో నిర్వహించిన 10వ తరగతి దూరవిద్య పరీక్షల్లో పల్నాడు జిల్లా 88.25 శాతం ఉత్తీర్ణతతో 3వ స్థానంలో నిలిచిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, దూరవిద్య జిల్లా కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హుస్సేన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షకు 919మంది అభ్యాసకులు హాజరు కాగా, 811మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఇంటర్మీడియేట్ దూరవిద్య పరీక్షల్లో 9వ స్థానంలో నిలిచిందన్నారు. పరీక్షకు 1,251మంది విద్యార్థులు హాజరు కాగా 1,013మంది అభ్యాసకులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అభ్యాసకులు ఉన్నత విద్య నిమిత్తం తమ మార్కుల జాబితాలను www.apopenrchoo.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని కళాశాలల్లో ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఒరిజినల్ మార్క్‌లిస్ట్‌లు మరో వారం రోజుల్లో అధ్యయన కేంద్రాలకు వస్తాయని తెలిపారు. అభ్యాసకులు తమ జవాబు పత్రాల రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు ఈనెల 13వ తేది వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్ట్‌లకు రూ.200, రీ వెరిఫికేషన్‌కు రూ.1000 ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాగసూరి వేణుగోపాల్‌కు 'పుట్టంరాజు' పురస్కారం

అద్దంకి: పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ పురస్కారాన్ని బహుగ్రంథ రచయిత, రేడియో ప్రయోక్త, పాఠ్యాంశాల రచయిత, వివిధ దినపత్రికల విశ్లేషకుడు నాగసూరి వేణుగోపాల్‌కు అందిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీన శ్రీనివాస ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోర్టు ఆదేశాలతో నిర్మాణ సంస్థపై కేసు


మార్టూరు: కాంట్రాక్ట్ పనులు చేయించుకుని బిల్లులు చెల్లించని సంస్థపై కేసు నమోదైంది. బాధితులు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి వివరాల మేరకు.. మండలంలోని కోనంకి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి ఎర్త్ మూవర్స్ యజమాని జొన్నలగడ్డ శ్రావణి మహారాష్ట్రకు చెందిన స్పేస్ ఇంజినీరింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకొని 2020లో నరసరావుపేట–రొంపిచర్ల మార్గంలో పైపులైను నిర్మాణ పనులు చేశారు. అందుకు సంబంధించి స్పేస్ ఇంజినీరింగ్ సంస్థ యజమాని పూనం యాదవ్ శ్రావణికి రూ.28 లక్షలు బకాయి పడ్డారు. తమ బిల్లులు చెల్లించాలని పూనమ్ యాదవ్, ఆమె భర్త సుఖదేవ్ వాసుదేవ్ యాదవ్‌లను శ్రావణి ఎన్నోసార్లు కోరారు. కాని వారు బిల్లులు చెల్లించకపోవడంతో శ్రావణి అద్దంకి కోర్టును ఆశ్రయించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అద్దంకి కోర్టు పూనమ్ యాదవ్, సుఖదేవ్ వాసుదేవ్ యాదవ్‌లపై కేసు నమోదు చేయాలని మార్టూరు పోలీసులను ఆదేశించింది. ఈక్రమంలో మంగళవారం హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తడారిన కృష్ణమ్మ

జలసిరులతో ఉరకలెత్తే కృష్ణమ్మ గుండె తడారింది. నిండుకుండను తలపించే నదీమతల్లి ఇసుక మేటల కడుపుకోతతో తల్లడిల్లుతోంది. చినుకు జాడ లేక వెలవెలబోతోంది. గలగల తాకే నీటి సవ్వడుల కోసం అడుగంటిన జలాశయాలు అర్రులు చాస్తున్నాయి. బీటలు వారిన చేలు 'జల'జ్జనని కటాక్షం కోసం నిలువెల్లా కనులై నిరీక్షిస్తున్నాయి. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న కర్షకుల నయనాలు పొలాల్లో ఆనంద తాండవం చేసే 'తడి' అడుగుల కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాయి.

- శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు వెలవెల
- రెండు రిజర్వాయర్లు నిండాలంటే 368.85 టీఎంసీలు అవసరం
- ఆల్మట్టి, తుంగభద్ర డ్యాంల్లోనూ కటకటే
- ఖరీఫ్ సాగుపై సందిగ్ధంలో రైతన్నలు
- కాలువల నీటి విడుదలపై రాని స్పష్టత
- జిల్లాలో నారుమళ్లు ఆలస్యం

సాగర్‌కు నీరొస్తేనే సాగు



అడుగంటిన నాగార్జునసాగర్ జలాశయం

సాక్షి, నరసరావుపేట: ఎగువన తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చే ప్రధాన జలాశయాలైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోకి ఇంకా వరదనీరు పోటెత్తలేదు. గతేడాది ఇదే సమయానికి శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారి సాగర్‌వైపు కృష్ణమ్మ పరుగులు తీసింది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌కు ఒక్క క్యూసెక్కు నీరూ రావడం లేదు. ఫలితంగా జలాశయం అడుగంటింది. ఈ ఏడాది పల్నాడు జిల్లా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 2,48,350 హెక్టార్లు కాగా సీజన్ మొదలై నెల రోజులవుతున్నా కనీసం 10 వేల హెక్టార్లలో కూడా సాగు ఆరంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సాగు ముందుకు సాగాలంటే కృష్ణానది ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసి వరద పోటెత్తి జలాశయాలు నిండాలి.

368.85 టీఎంసీల నీరు అవసరం...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధిక శాతం వ్యవసాయం కాలువలు, ఎత్తిపోతల పథకాల ఆధారంగా జరుగుతోంది. కృష్ణానదిపై ఉన్న నాగార్జున సాగర్ జలాశయం ద్వారా సాగుకు నీరు అందుతుంది. అయితే సాగర్ నీటి సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 121.71 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. అంటే సాగర్ డెడ్ స్టోరేజ్ సామర్థ్యం 131.669 టీఎంసీల కన్నా తక్కువ ఉంది. సాగర్ డ్యాం నిండాలంటే 190 టీఎంసీల నీరు కావాల్సి ఉంది. సాగర్‌కు ఎగువ నుంచి వరద నీరు వచ్చే శ్రీశైలం ప్రాజెక్టులోనూ ఇదే పరిస్థితి నెలకొంది. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 37.3 టీఎంసీలు మాత్రమే ఉంది. శ్రీశైలం నిండాలంటే మరో 178.51 టీఎంసీలు అవసరం. నాగార్జునసాగర్ జలాశయానికి ఇన్‌ఫ్లో ఏమాత్రం లేదు.

ఎగువ రాష్ట్రాల్లోనూ ఇదే దుస్థితి

కృష్ణానదిపై ఉన్న ఎగువ రాష్ట్రాల్లోని జలాశయాలు నిండి భారీ స్థాయిలో వరద వస్తేనే శ్రీశైలం, నాగార్జున సాగర్‌లలోకి పూర్తిస్థాయి నీటి మట్టం రానుంది. ఎగువన ఉన్న ఆల్మట్టి నిండాలంటే 89.75 టీఎంసీలు, జూరాలకు 1.98 టీఎంసీలు, నారాయణపూర్‌కు 12.58 టీఎంసీలు, తుంగభద్రకు 92.95 టీఎంసీలు అవసరం. ప్రస్తుతం వీటికి చెప్పుకోదగ్గ ఇన్‌ఫ్లో లేకపోవడంతో శ్రీశైలం, సాగర్‌లకు వరదనీరు రాక ఆలస్యమయ్యే సూచనలే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం జలాశయాలలో నీరు లేకపోవడంతో రైతులు సాగుకు ముందుకు రావడంలేదు. దీంతో విత్తన మార్కెట్ మందకొడిగా ఉంది. కాలువలకు నీటి విడుదల ఎప్పుడో తెలియని దుస్థితి నెలకొనడంతో మిర్చి నర్సరీలు నారు పెంచడానికి సాహసించడం లేదు, అలాగే రైతులు వరి నారు పనులు మొదలుపెట్టలేదు.

నీరు లేక సాగు డీలా



నాకు ఏడు ఎకరాల పొలం ఉంది. గతంలో ఈపాటికి ఖరీఫ్ సాగు పనులు ప్రారంభమయ్యేవి. ఈఏడాది ఇంకా సాగర్‌కు వరదనీరు చేరకపోవడం, కాలువలకు నీటి విడుదల ఆలస్యం కానుండటంతో సాగు పనులు మొదలు పెట్టలేదు. సాగర్‌కు నీటి చేరిక ప్రారంభమైతే వరి, మిర్చి, మొక్కజొన్న పంటల సాగుకు సిద్ధమవుతా. కృష్ణానది పరివాహక ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసి శ్రీశైలం, సాగర్లకు వరదనీరు పోటెత్తితేనే సాగుకు వీలవుతుంది.

– కల్లి వెంకటరెడ్డి,
రొంపిచర్ల గ్రామం, పల్నాడు జిల్లా



నాగార్జునసాగర్ దిగువన కృష్ణానదిలో నీరు లేని దృశ్యం

రాష్ట్రంలో కృష్ణానదిపై ఉన్న ప్రధాన జలాశయాలలో పరిస్థితి ఇలా..

జలాశయం	సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నీటి పరిమాణం (టీఎంసీలు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)
శ్రీశైలం	215.81	37.3	1,033	1,600
నాగార్జున సాగర్	312.05	121.71	0	874
పులిచింతల	45.77	0.4	62	50
ప్రకాశం బ్యారేజ్	3.07	2.08	590	0

ఎగువ రాష్ట్రాలలో కృష్ణానదిపై ఉన్న ప్రధాన జలాశయాలలో పరిస్థితి ఇదీ..

జలాశయం	సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నీటి పరిమాణం (టీఎంసీలు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)
ఆల్మట్టి	129.72	39.97	24,761	430
జూరాల	9.66	7.68	0	1,562
నారాయణపూర్	37.64	25.06	206	95
తుంగభద్ర	100.86	7.91	13,410	567

పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా అరుణ్‌బాబు

- గతంలో జిల్లాలో ఆర్డీఓగా పనిచేసిన అనుభవం
- ప్రస్తుత కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్ బదిలీ
- పార్వతీపురం మన్యం కలెక్టర్‌గా ప్రస్తుత జేసీ శ్యాంప్రసాద్



పి.అరుణ్‌బాబు



ఏ శ్యాం ప్రసాద్

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లా నూతన కలెక్టర్‌గా పి అరుణ్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా గతేడాది ఏప్రిల్ 10వ తేదీ నుంచి పనిచేస్తున్నారు. అక్కడి నుంచి పల్నాడు జిల్లా మూడో కలెక్టర్‌గా రానున్నారు. అరుణ్‌బాబుకు గతంలో పల్నాడు ప్రాంతంలో పనిచేసిన అనుభవం ఉంది. 2011 నుంచి 2013 మధ్య నరసరావుపేట ఆర్డీఓగా పనిచేశారు. ఆ తర్వాత గురజాల ఆర్డీఓగా వెళ్లారు. పల్నాడు ప్రాంతంలో ఉన్న రెండు రెవెన్యూ డివిజన్లలో ఆర్డీఓగా పనిచేయడంతో జిల్లాపై పూర్తి అవగాహన ఉంది. ప్రస్తుత కలెక్టర్ శ్రీకేశ్ బి.లత్కర్‌ను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈయన మే నెల 19వ తేదీ నుంచి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో అప్పటి వరకు కలెక్టర్‌గా పనిచేసిన శివశంకర్ లోతేటి స్థానంలో ఈయన్ని ఎన్నికల కమిషన్ నియమించింది. పల్నాడు జిల్లా మొదటి కలెక్టర్‌గా పనిచేసిన శివశంకర్ లోతేటిని కడప జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పల్నాడు జిల్లా ఏర్పడినప్పటి నుంచి జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఏ శ్యాంప్రసాద్‌ను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్‌గా నియమించారు.

భూమిపై కౌలు రైతులకు హక్కులు ఉండవు

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్
- నందిగామలో రైతులు, కౌలురైతులకు అవగాహన సదస్సు



నందిగామలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి: కౌలు రైతులు పొందే పంట సాగు హక్కు పత్రాలతో (సీసీఆర్‌సీ) భూమిపై ఎటువంటి హక్కులు ఉండవని, భూ యజమానులు ఆందోళన చెందాల్సిన పనిలేదని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో 'పంట సాగు హక్కు పత్రాలపై (సీసీఆర్‌సీ) కౌలు రైతులకు, రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి భూ యజమాని కూడా కౌలు రైతులకు వారు సాగు చేస్తునటువంటి భూమికి సాగుదారు హక్కు పత్రం ఇవ్వాలన్నారు. కౌలు రైతులు ఈ రుణ అర్హత కార్డు ద్వారా పంట రుణం, విత్తనాలు సబ్సిడీ, పంట నష్టపరిహారం, పంట బీమా మాత్రమే పొందగలుగుతారన్నారు. భూమిపై కౌలు రైతులకు ఎటువంటి స్వాధీన హక్కుగానీ, ఇతర హక్కులు పొందలేరన్నారు. భూమిపై సర్వ హక్కులు భూ యజమానికే ఉంటాయన్నారు. పంట సాగు హక్కు పత్రం పంట కాల పరిమితి వరకు మాత్రమే ఉంటుందన్నారు. ప్రతి కౌలు రైతు భూ యజమానిని సంప్రదించి వారి అంగీకారంతో గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, ఉద్యాన అసిస్టెంట్ వారి ద్వారా కౌలు రైతు కార్డు పొందేందుకు దరఖాస్తు చేసుకుని పంటసాగు హక్కు పత్రం పొందా లన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు, కౌలు రైతులకు గత 25 రోజుల నుంచి జిల్లాలో అవగాహన నిమిత్తం గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది జిల్లాలో 65 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనికి గాను ఇప్పటి వరకు 10 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశామన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. సదస్సులో సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ సీహెచ్ ఉష, సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఏడీఏ ఎస్.శ్రీధర్ రెడ్డి, నందిగామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి తదితరులు ఉన్నారు.

అభ్యాసన నైపుణ్యాల మెరుగే లక్ష్యం

- టీచ్ టూల్‌తో మెరుగైన బోధన
- జిల్లాలో 269 మంది శిక్షణకు ఎంపిక
- ఈనెల 18 నుంచి 27 వరకు శిక్షణ



టీచ్ టూల్ లోగో

సత్తెనపల్లి: తరగతి గదిలో అభ్యాసన నైపుణ్యాల మెరుగుదలకు రాష్ట్ర విద్యాశాఖ ఆచరణాత్మక ప్రణాళికతో ముందుకెళ్తోంది. అభ్యసన పరివర్తన సహాయక పథకం (సాల్ట్) ప్రాజెక్టు నిర్వహణలో భాగంగా రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ), సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో టీచ్ టూల్ పేరుతో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీ, సీఆర్‌ఎంటీలకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. టీచ్ టూల్ ద్వారా ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను అధ్యయనం చేయనున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చేందుకు .. అదే సమయంలో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఎస్‌సీఈఆర్‌టీ పలు రకాల పద్ధతులను అధ్యయనం చేస్తోంది. టీచింగ్ సామర్థ్యాలు ఎలా ఉన్నాయి? టీచర్‌కు, విద్యార్థికి మధ్య సంబంధాన్ని తెలుసుకునేందుకు టీచ్ టూల్ అబ్జర్వేషన్స్ ఉపయోగపడుతున్నాయి. పరిశీలనాంశాలను డిజిటల్ బేస్డ్‌గా యాప్‌లో నమోదు చేస్తున్నారు. ప్రపంచ స్థాయి బోధనా పద్ధతులపై జిల్లాలో 269 మంది మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించనున్నారు.

ఈనెల 18 నుంచి జిల్లాలో శిక్షణ

పల్నాడు జిల్లా నుంచి శిక్షణ పొందిన 18 మంది మాస్టర్ ట్రైనీలు టీచ్ టూల్ అబ్జర్వర్స్‌గా ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇస్తారు. పల్నాడు జిల్లాలో ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు 9 రోజులపాటు శిక్షణ ఇస్తారు. సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలనా సమయంలో బిహేవియర్ స్కిల్స్ ఎలా ఉంటాయి? బిహేవియర్స్ స్కిల్స్‌కు కోడ్స్ ఎలా ఇవ్వాలి? తదితర విషయాలపై శిక్షణ పొందనున్నారు.

గుణాత్మక విద్యను అభివృద్ధి చేసేందుకు

ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ క్వాలిటీ లెర్నింగ్ (గుణాత్మక విద్య) లక్ష్యంగా సాల్ట్ ప్రోగ్రామ్‌ను రూపొందించారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు ఎలా ఉన్నాయి? విద్యార్థి స్థాయికి వెళ్లి బోధన చేస్తున్నారా? ఉపాధ్యాయుడి బోధనను విద్యార్థులు ఏ విధంగా రిసీవ్ చేసుకుంటున్నారు? ఉపాధ్యాయుడు బోధనలో 21వ శతాబ్దపు నైపుణ్యాలను అమలు చేస్తున్నారా? లేదా? తదితర విషయాలను టీచ్ టూల్ ద్వారా సర్టిఫైడ్ అబ్జర్వర్స్ తరగతి గదుల్లో పరిశీలన చేస్తున్నారు.

విద్యా ప్రమాణాల పెంపుదలకు టీచ్ టూల్

విద్యా ప్రమాణాల పెంపుదలకు టీచ్ టూల్ ప్రోగ్రామ్ మేలైన అంశంగా చెప్పవచ్చు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య అభ్యసన పద్ధతుల్లో ఉన్న గ్యాప్‌ను పూడ్చడానికి టీచ్ టూల్ అబ్జర్వేషన్ చక్కని సాధనం. ఉపాధ్యాయుడు వృత్తి నైపుణ్యాల మెరుగుదలకు ఉపకరించే విధంగా టీచ్ టూల్ రూపొందించడం జరిగింది. సమర్థవంతంగా టీచ్ టూల్ ప్రోగ్రామ్‌ను అమలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. సర్టిఫైడ్ అబ్జర్వర్స్‌కు పకడ్బందీగా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. టీచ్ టూల్ అబ్జర్వర్‌గా ఎంపికైన వారందరూ కచ్చితంగా శిక్షణ పొందాలి.

–ఎం.వెంకటేశ్వర్లు,
జిల్లా విద్యాశాఖాధికారి, పల్నాడు

మాచర్ల మున్సిపల్ కమిషనర్ కారు ధ్వంసం

- దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- సీసీ పుటేజీ నుంచి ఆధారాలు సేకరణ



ధ్వంసం చేసిన కారును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటదాస్

మాచర్ల: మాచర్ల కార్యాలయం ఆవరణలో పార్కింగ్ చేసిన కమిషనర్ వెంకటదాస్ కారును మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఘటన సమాచారాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్‌కు వాచ్‌మన్ తెలియజేశారు. కమిషనర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సహకారంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారు వెనుక, ముందు భాగం, లోపల సీట్లు ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఈ విషయంపై మున్సిపల్ కార్యాలయం బయట, లోపల ఉన్న సీసీ పుటేజీలు పరిశీలించారు. ముగ్గురు వ్యక్తులు లోపలకు ప్రవేశించి ధ్వంసానికి పాల్పడినట్లు గుర్తించారు. మున్సిపల్ కార్యాలయం లోపలకు ప్రవేశించిన దుంగడులు కార్యాలయంలోని సీసీ కెమెరాల కనెక్షన్ కట్ చేసి విధ్వంసానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. బయట ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా ముగ్గురు వ్యక్తులు ఘటనకు పాల్పడినట్లు గుర్తించారు. మున్సిపాలిటికి సంబంధించిన వ్యక్తులే చేసినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సీఐ బ్రహ్మయ్య సీసీ పుటేజీల నుంచి సేకరించిన ఆధారాలను బట్టి దర్యాప్తు చేపట్టారు.

కారు ధ్వంసం దురదృష్టకరం

తన కారును కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం దురదృష్టకరమని మున్సిపల్ కమిషనర్ వెంకటదాస్ అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అద్దెకు తీసుకున్న కారును అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తనకు సమాచారం అందినట్లు తెలిపారు. పోలీసులకు ఘటనపై సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నారని, ఈఘటనకు పాల్పడిన వారు మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన వారేనని అనుమానాలు ఉన్నాయని, పోలీసులు ఆ కోణంలో విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు. తనతో ఇప్పటికే పురపాలక సంఘ మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ మాట్లాడినట్లు తెలిపారు. దీనిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బైకును ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



అద్దంకి: బైకును లారీ ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి దుర్మరణం పాలవగా మరో వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. ఈఘటన పట్టణంలోని కలవకూరు రోడ్డులోని వైపెస్సార్ అపార్ట్‌మెంట్ వద్ద బుధవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన బండారు ఏసుబాబు (45), తాళ్లూరు అశోక్‌లు అద్దంకి వచ్చారు. ఈ క్రమంలో పనులు ముగించుకుని తిరిగి వెళ్లే సమయంలో బైకు అద్దంకి–కలవకూరు రోడ్డులోని వైఎస్సార్ అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకోగానే వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఏసుబాబు బైకు కిందపడింది. వాహనం నడుపుతున్న ఏసుబాబు అక్కడిక్కడే మృతిచెందాడు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడు అశోక్‌ను 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మా ఇంటికి వస్తేనే పింఛన్ ఇస్తాం

- పరగటిచర్లలో టీడీపీ నాయకుల అరాచకం
- పలువురికి అందని పింఛన్
- ఇంటి వద్దనే పింఛన్ ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి



డీఆర్వో వినాయకంకు వినతిపత్రం అందజేస్తున్న వృద్ధులు

నరసరావుపేట: లబ్ధిదారు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుండగా క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. తమ ఇంటి వద్దకు వస్తేనే సొమ్ము ఇస్తామంటూ టీడీపీ నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. రొంపిచర్ల మండలం పరగటిచర్లలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పలువురు లబ్ధిదారులు మంగళవారం కలెక్టర్‌ను కలిసేందుకు నరసరావుపేట వచ్చారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో డీఆర్వో వినాయకంను కలిసి ఇంటి వద్దనే పింఛన్ సొమ్ము ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకుడు, దివంగత చిగురుపాటి ఆదినారాయణ ఎంపీపీగాను, సొసైటీ అధ్యక్షునిగాను పనిచేశారు. సామాజిక పింఛన్‌ను ఆదినారాయణ ఇంటివద్దకు వచ్చి తీసుకోవాలని, లేనిపక్షంలో ఇవ్వబోమని టీడీపీ గ్రామ నాయకులు సోమ, మంగళవారాలలో దండోరా వేయించారు. దీంతో పలువురికి పింఛన్ సొమ్ము అందలేదు. మంగళవారం గ్రామానికి చెందిన కామినేని వెంకయ్య, కోమటినేని ఏడుకొండలు, గోపుదేసి సుబ్బారావు, సిద్దాబత్తుని జానకమ్మలు కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్‌ను కలిసేందుకు నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్వోకు తమ సమస్యను వివరించారు. ఆదినారాయణ ఇంటికి వెళ్లకపోతే పింఛన్ రాదని బెదిరించటంతో చాలామంది అక్కడకే వెళ్లి తీసుకున్నారన్నారు. మాకు మా ఇళ్ల వద్దనే పింఛన్ ఇప్పించాలని వారు కోరారు.

ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయి వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 24లోపు సమీపంలోని ఇంటర్నెట్ కేంద్రాలతో పాటు ప్రభుత్వ ఐటీఐలలో ''ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్'' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అమరేశ్వరా.. ఈ కౌలు ఏ పాలు?!

- పొరుగు రాష్ట్రంలో అమరేశ్వరుని భూములు 410.34 ఎకరాలు
- ఎకరాకు వెయ్యి రూపాయలే కౌలు!


అమరేశ్వరుడు

అమరావతి: నామమాత్రంగా కౌలు చెల్లిస్తుండడంతో అమరావతి అమరేశ్వరుని ఆదాయానికి భారీగా గండిపడుతోంది. కౌలు పెంపు కోసం అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తెలంగాణ రాష్ట్ర డెప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను ఆలయ ఈఓ కలవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలో అమరేశ్వర ఆలయానికి 410.34 ఎకరాల భూమి ఉంది. ఏటా పంటలూ పండించుకుంటూ ఆదాయాన్ని పొందుతున్న రైతులు ఎకరాకు రూ.1000కి మించి కౌలు ఇవ్వడం లేదు. గ్రామంలో మిగిలిన పొలాలకు కనీసం రూ.5000 నుంచి రూ.7000 కౌలు చెల్లిస్తున్నారు. దీని ప్రకారం ఏడాదికి సుమారు రూ.20 నుంచి రూ.30 లక్షల కౌలు ఆదాయం ఆలయం కోల్పోతుంది. పదిహేనేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. బహిరంగ వేలంతో ఆదాయం పెంచుకునేందుకు అధికారులు చేసిన కృషి తెలంగాణ రాజకీయ నాయకుల పలుకుబడి ముందు ఫలించ లేదు. రైతులకు సహకరించకపోతే ఓట్లు పోతాయనే భయంతో అధికారులపైనే ఒత్తిడి తీసుకువచ్చి గ్రామసభ ద్వారా మధ్యేమార్గంగా నామమాత్రంగా కౌలు చెల్లిస్తున్నారు.

భూములపై అధికారుల నియంత్రణ శూన్యం

క్రీ.శ 17శతాబ్దంలో అమరావతిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు స్వామివారి నిత్యధూప, దీప నైవేద్యాలకు ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరు గ్రామంలోని 410.34 ఎకరాల మాన్యాన్ని అందించారు. కాలక్రమేణా వాసిరెడ్డి వంశస్తుల అజమాయిషీలో మాన్యం కౌలు ద్వారా వచ్చిన ఆదాయాన్ని స్వామివారి సేవలకు వినియోగించారు. 19వ శతాబ్దంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోకి వచ్చిన తరువాత భూముల వేలం పాటలపై అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఆ భూములకు రైతులు కొన్నాళ్లు కౌలు చెల్లించకుండా పండించుకున్నారు. ఈ నేపథ్యంలో కొందరు దేవదాయశాఖాధికారులు చేసిన ప్రయత్నాలతో ఎకరాకు రూ.200 నుంచి రూ.400 వరకే కౌలు చెల్లించారు. ఎంతో విలువైన భూముల నుంచి నామమాత్రపు ఆదాయం లభిస్తుందని గ్రహించిన దేవాదాయశాఖ ఉన్నతాధికారులు 2009లో తమ శాఖలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కుసుమకుమారిని విచారణాధికారిగా నియమించారు. దెందుకూరు గ్రామంలోని ఇతర భూములకు, దేవాలయ భూముల కౌలుకు వ్యత్యాసం ఉందని, ఏటా లక్షలాది రూపాయల ఆదాయాన్ని దేవాలయం కోల్పోతుందని విచారణాధికారి ప్రభుత్వానికి నివేదిక అందచేశారు.

కౌలు తగ్గింపులో ఏకమైన గ్రామం!

మామూలుగా పార్టీలు, వర్గాలు, వ్యక్తుల పరంగా విడివిడిగా ఉండే గ్రామస్తులు దేవుడు భూముల కౌలు విషయంలో మాత్రం ఐక్యంగా ఉండటం విశేషం. దీన్ని ఆధారంగా చేసుకుని 2011వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దెందుకూరు గ్రామంలోని భూములకు బహిరంగ వేలం నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. దీని ప్రకారం దెందుకూరులో తొలుత అధికారులు స్వామివారి భూముల కౌలుకు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. గ్రామం మొత్తం ఏకమై బహిరంగ వేలంలో రైతులు పాల్గొనకుండా అడ్డుకున్నారు. ఎవరైనా వేలంలో పాల్గొంటే సాగునీటి వనరులు, పొలాల్లోకి ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు వెళ్లడానికి అడ్డగిస్తామని ఇతర గ్రామాల రైతుల్ని బెదిరించడంతో ఎవరూ ముందుకు పాల్గొనలేదు. రెండో విడత మధిర తహసీల్దార్ కార్యాలయంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించగా దేవుడు భూములు సాగు చేస్తున్న రైతుల కుటుంబాల ఓట్లు పోతాయనే భయంతో అనాటి పాలకులు రంగప్రవేశం చేసి వేలం జరగనివ్వలేదు. 2012లో నిర్వహించిన గ్రామసభలో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న కుటుంబాలు ఈ వేలం వల్ల నష్టపోతాయని గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు దేవదాయ శాఖాధికారులపై ఒత్తిడి తెచ్చి ఎకరాకు రూ.400 నుంచి రూ.1000 కౌలు పెంచి మూడేళ్లకు ఒకే కౌలు ఉండే విధంగా రాజీ కుదిర్చారు. ఈ నిర్ణయం మేరకు కౌలు చేసే సుమారు 250 మంది రైతుల నుంచి ఏడాదికి రూ.4,10,340 చొప్పున మూడేళ్లకు రూ.12,31,020 ఆదాయం వస్తుంది. ప్రస్తుత కౌలు రేట్ల ప్రకారం మూడేళ్లకు రూ.60 నుంచి రూ.90 లక్షకు పైగా రావాల్సిన ఆదాయంరూ.12.31 లక్షలతో సరిపెట్టుకున్నారు.

బహిరంగ కౌలుకు ఏర్పాట్లు

గతంలో దేవదాయశాఖాధికారులు, రెవెన్యూ అధికారులు సమక్షంలో నిర్ణయించిన కౌలు సొమ్ము చెల్లింపులలోనే ఇంకా కొంత మొత్తం రైతులు బకాయి చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క దృష్టికి బహిరంగకౌలు వేలం విషయం తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలో దేవదాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగ కౌలు వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

–వేమూరి గోపీనాథ శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి

చెలరేగిన బ్యాట్స్‌మెన్




మంగళగిరి: బ్యాట్స్‌మెన్ సెంచరీలతో చెలరేగిపోవడంతో విశాఖ జట్టు భారీ స్కోర్ సాధించింది. అమరావతి టౌన్ షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏసీఏ అండర్–16 మల్టీ డే ఇంటర్ పోటీలు కొనసాగుతున్నాయి. మంగళవారం విశాఖపట్నం–శ్రీకాకుళం జట్టు మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత టాస్ గెలిచిన శ్రీకాకుళం జట్టు బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు క్రికెటర్లు సెంచరీలు, అర్ధ సెంచరీలతో చెలరేగడంతో 91 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 362 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఎ.పూర్ణచంద్ రెండు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 105 పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ 8 ఫోర్లతో 101 పరుగులు చేశాడు. వి.సి.హెచ్.శ్రవన్‌కుమార్ 5 ఫోర్లతో 52 పరుగులతో అర్ధసెంచరీ సాధించాడు. దీంతో విశాఖ జట్టు భారీ స్కోర్ సాధించింది. శ్రీకాకుళం జట్టు బౌలర్లు కె.మనీష్, సాయి వెంకట ప్రణీత్ చెరో రెండు వికెట్లు తీశారు.

సొసైటీలకు పర్సన్ ఇన్‌చార్జుల నియామకం


అన్నవరం సొసైటీ భవనం

రొంపిచర్ల: జిల్లాలోని 59 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు సొసైటీలకు ముగ్గురు సభ్యులతో కూడిన పాలకవర్గాలు పాలన చేశాయి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావటంతో కమిటీలు అన్ని రాజీనామాలు సమర్పించాయి. సొసైటీలన్నింటికీ పాలకవర్గాలు లేకపోవటంతో పాలన నిరంతరాయంగా సాగేందుకు అంతరాయం ఏర్పడకుండా ప్రభుత్వ అధికారులనే పర్సన్‌ఇన్‌చార్జిలుగా నియమించారు. పల్నాడు జిల్లాలో 60 ప్యాక్స్ ఉండగా 59 ప్యాక్స్‌లకు పిఐసీలను నియమించారు. సత్తెనపల్లి ఏరియాలోని లక్కగార్లపాడు సొసైటీకి గతంలోనే అధికారుల నియామకం జరిగింది. సహకార శాఖలో పనిచేస్తున్న అధికారులనే ప్యాక్స్‌కు పిఐసీలుగా నియమించారు. జొన్నలగడ్డ, ఇక్కుర్రు, లింగంగుంట్ల, గణపవరం, నాదెండ్ల ప్యాక్స్‌కు కె.అంజమ్మ అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎస్‌డీఎల్‌సీవో నరసరావుపేట వారిని పిఐసీగా నియమించారు. అంగలూరు, బొల్లాపల్లి, వినుకొండ ప్యాక్స్‌లకు పి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎస్‌డీఎల్‌సీవో వినుకొండకు నియమించారు. ముప్పాళ్ల ఏబీఎఫ్ఎస్‌సీ, ధూళిపాళ్ల, మాదల ప్యాక్స్‌కు టి.రజిని అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎస్‌డీఎల్‌సీవో సత్తెనపల్లి, మునుగోడు, అచ్చంపేట, నరుకుళ్లపాడు, వేల్పూరు, పెదమద్దూరు ప్యాక్స్‌కు ఎం.మోసెస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎస్‌డీఎల్‌సీవో సత్తెనపల్లి, గుర్రపునాయుడుపాలెం, ఈపూరు, అన్నవరం, బుచ్చిబాపన్నపాలెం, కారుమంచి, నూజెండ్ల, శావల్యాపురం ప్యాక్స్‌కు ఎన్.సురేంద్రబాబు ఎస్‌డీఎల్‌సీవో వినుకొండ, చర్లగుడిపాడు, పురిపాడు, సిరిగిరిపాడు, దుర్గి, కండ్లగుంట ప్యాక్స్‌కు ఎస్‌కె.రహంతుల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్, డీఎల్‌సీవో, నరసరావుపేట, అనుపాలెం, గుడిపూడి ప్యాక్స్‌కు ఎం.ప్రమీలాదేవి అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎస్‌డీఎల్‌సీవో సత్తెనపల్లి, సంతగుడిపాడు, సుబ్బయ్యపాలెం, గురజాల, కారంపూడి, రొంపిచర్ల ప్యాక్స్‌కు కె.రవికుమార్ సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌డీఎల్‌సీవో వినుకొండ, బ్రాహ్మణపల్లి, దాచేపల్లి, కరాలపాడు, మాచవరం, పెదఅగ్రహారం, మీరాపురం ప్యాక్స్‌కు కె.శ్రీనివాసరావు సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌డీఎల్‌సీవో గురజాలలను నియమించారు. పాకాలపాడు, నందిరాజుపాలెం, ఫణిదం సొసైటీలకు ఎం.వి.నర్సయ్య సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌డీఎల్‌సీవో సత్తెనపల్లి, మంచికల్లు, పాల్వాయి, రెంటచింతల, పిడుగురాళ్ల, మాచర్ల ప్యాక్స్‌కు సిహెచ్.స్వరూప సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌డీఎల్‌సీవో గురజాల. క్రోసూరు, పర్సతాకూరు, యడ్లపాడు, మర్రిపాలెం, సొలస ప్యాక్స్‌కు పి.ఫిబి సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌డీఎల్ సీవో సత్తెనపల్లి. నకరికల్లు, చీమలమర్రి, విప్పర్ల, వరికపూడి, కొమరివల్లిపాడు ప్యాక్స్‌కు వై.మహేష్‌కుమార్ సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎస్‌డీఎల్‌సీవో వినుకొండ వారిని అఫీసియల్ పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ డిప్యూటీ రిజిస్ట్రార్ యు.నాగశ్రీనివాస్ ఉత్తర్వులు ఇచ్చారు. నియామకాలు ఆరు నెలల పాటు లేదా ఎన్నికలు జరిగే అంతవరకూ కొనసాగుతాయి.

సెక్స్ రేషియో అభివృద్ధికి ఉపయోగపడాలి

- డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.హనుమకుమార్
- స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు


స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్

నరసరావుపేట: స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు గర్భస్థ శిశువు ఆడా, మగా అనేది తెలియచేయకుండా సెక్స్ రేషియో అభివృద్ధికి తోడ్పడాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.హనుమకుమార్ కోరారు. మంగళవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆదేశాల మేరకు పట్టణంలోని శ్రీ త్రికోటేశ్వర ఇమేజింగ్ సెంటర్, భారతీ స్కాన్ సెంటర్, సాయి తిరుమల డయాగ్నస్టిక్ సెంటర్‌లను తనిఖీ చేసి చట్టప్రకారం వారు నిర్వహిస్తున్న స్కానింగ్‌లను పరిశీలించారు. స్కానింగ్ రూమ్, రిసెప్షన్, గర్భిణుల వెయిటింగ్ రూమ్‌లను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, చట్టం నియమాలను ప్రదర్శనగా ఉంచాలని సూచించారు. ఆయా సెంటర్ల యజమానులతో మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994 నిబంధనలకు లోబడి స్కానింగ్ సెంటర్లను ఖచ్చితంగా నిర్వహించాలని సూచించారు. గర్భిణులకు నిర్వహించే స్కానింగ్ ద్వారా గర్భ శిశువు ఆరోగ్య పరిస్థితి, పెరుగుదల, అవయవాల పరిస్థితి తెలుసుకోవటానికే కాని, పుట్టబోయే బిడ్డ ఆడ, మగ శిశువు అనేది నిర్ధారించటానికి కాదని అన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడశిశువు అనే ఆ విషయం ఆమెకు కాని, తల్లిదండ్రులకు కాని, భర్తకు, భర్త బంధువులకు ఎటువంటి పరిస్థితిలో తెలియచేయాకూడదన్నారు. ఈ విధంగా తెలియచేసి ఆడ శిశువుల భ్రూణ హత్యలకు కారకులు కారాదని హెచ్చరించారు. ఆ విధంగా తెలియచేస్తే చట్టపరమైన చర్యలకు గురవుతారని అన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ప్రతినెలా ఫామ్ ఎఫ్ ఆన్‌లైన్ రిపోర్టు డీఐవో ద్వారా సబ్‌మిట్ చేయాలని కోరారు. రిఫరల్ స్లిప్‌లు, గర్భిణుల విల్లింగ్ అప్లికేషన్ స్కాన్ రిపోర్టు విధిగా రికార్డు చేయాలని తెలియచేశారు. డెప్యూటీ డెమో కె.సాంబశివరావు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో కోళ్ల వాహనం బోల్తా

- వాహనంతోపాటు డివైడర్ ధ్వంసం
- వాహనంలో తరలిస్తున్న కోళ్లు వెయ్యికి పైగా మృత్యువాత


హైవే జంక్షన్ వద్ద బోల్తా పడిన కోళ్ల లారీ

యడ్లపాడు: 16వ నంబర్ ఎక్స్‌ప్రెస్ హైవే డివైడర్‌పై అడ్డంగా ఐచర్ వాహనం పడటంతో పెనుప్రమాదం తప్పింది. వాహనంలోని డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడగా అందులో తరలిస్తున్న కోళ్లు భారీగా మృత్యువాత పడ్డాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...విద్యార్థులతో హైవేపై ప్రయాణిస్తున్న స్కూల్‌బస్ మండలంలోని తిమ్మాపురం హైవే జంక్షన్ వద్దకు రాగానే స్లో అయింది. బస్సు వెనుకే వేగంగా వస్తున్న ఐచర్ వాహనం డ్రైవర్ గమనించి షడన్ బ్రేక్ వేశాడు. అదే మార్గంలో వేగంగా దూసుకువచ్చిన గుర్తు తెలియని ట్యాంకర్ ఐచర్ వాహనాన్ని ఢీకొంది. దీంతో ఐచర్ వాహనం హైవే డివైడర్‌పై అడ్డంగా పడింది. ఢీకొట్టిన ట్యాంకర్ నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఐచర్ వాహనం డ్రైవర్, క్లీనర్‌లు సురక్షితంగా బయటపడగా, వాహనం, డివైడర్‌లు ధ్వంసం అయ్యాయి. వాహనంలోని 2వేల కోళ్లలో సగానికి పైగా మృతి చెందాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని హైవేపై అడ్డంగా ఉన్న వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్

క్రోసూరు: అతిసార వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్రరత్నాకర్ అన్నారు. క్రోసూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఎన్ని ఉన్నాయో పరిశీలించారు. అవసరమైతే మరిన్ని తెప్పించుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలని, సురక్షితమైన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. రోటా వైరస్, తట్టుకు సంబంధించిన టీకాలు వేయించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని ఉపయోగించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్, జింక్ ద్రావణాలు తాగించాలన్నారు. కార్యక్రమంలో సహాయ అధికారి వెంకటేశ్వరరావు, హెచ్ఎస్ శివుడు, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ స్కోర్ దిశగా చిత్తూరు



నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా మంగళవారం చిత్తూరు, కర్నూలు జిల్లా జట్ల మధ్య మూడో మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు నష్టానికి 361 పరుగులు చేసింది. జట్టులోని నవధీర్ సాహస్‌నిహాల్ 107 బంతుల్లో 100 పరుగులతో సెంచరీ చేశాడు. వీటిలో 9 ఫోర్లు, 6 సిక్స్‌లు ఉన్నాయి. సిద్ధూ 72, దర్శిత్ 50 పరుగులు సాధించారు. కర్నూలు బౌలర్ జె.సువిశేష్‌కు 2 వికెట్లు లభించాయి. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు. బుధవారం రెండవరోజు ఆట కొనసాగనుంది.

వేధింపులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ


మాట్లాడుతున్న సుబ్బరావమ్మ, వేదికపై మల్లీశ్వరి

నరసరావుపేట: రాష్ట్రంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చిరుఉద్యోగులైన అంగన్‌వాడీలపై వేధింపులకు పాల్పడుతోందని ఇప్పటికైనా అటువంటి చర్యలు మానుకోపోతే ఊరుకునేదిలేదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు ఇస్తామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ హెచ్చరించారు. మంగళవారం నరసరావుపేటలోని కోటప్పకొండరోడ్డు పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ప్రాజెక్టు లీడర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ మెటిల్డాదేవి అధ్యక్షత వహించారు. సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఒకటవ తేదీన వేతనాలు ఇచ్చినందుకు సంతోషపడాలో, నూతన ప్రభుత్వ వేధింపులు పట్ల బాధపడాలో అర్థంకాని పరిస్థితుల్లో అంగన్‌వాడీలు ఉన్నారన్నారు. ప్రతిపక్ష హోదాలో రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె శిబిరాలను సందర్శించిన టీడీపీ నాయకులు అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి అండగా ఉంటామని హామీ ఇచ్చారని వివరించారు. అంగన్‌వాడీల ఓట్లతో అధికారంలోకి వచ్చాక అదే అంగన్వాడీలపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే అనేకమంది అంగన్‌వాడీలను టీడీపీ నాయకులు బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి రాజీనామాలు చేయించారని, వేధింపులు తాళలేక ఒక అంగన్వాడీ కార్యకర్త గుండెపోటుకు గురైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జిల్లా ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని చిరుద్యోగులపై కక్షపూరిత రాజకీయాలు ఆపాలని ఉద్యోగాలు చేసుకునే విధంగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 12 నుంచి జనవరి 22 వరకు నిర్వహించిన సమ్మెలో మద్దతు తెలిపిన టీడీపీ నాయకులు తమను గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన నేపథ్యంలో గెలిచిన టీడీపీ ఎమ్మెల్యేలను యూనియన్ తరపున ఇటీవల కలిసి సమస్యలు విన్నవించామని గుర్తుచేశారు. ఒక వైపు కక్షపూరిత రాజకీయాలు, వేధింపులు ఉండవంటూనే మరోవైపు ఎమ్మెల్యేలు మా వర్గీయులను సంతృప్తి పరచాలంటే తప్పదు కదా అంటూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. అంగన్వాడీల వేధింపులపై ప్రభుత్వం జిల్లా యంత్రాంగం స్పందించి న్యాయం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ యూనియన్ బలోపేతంగా ఉంటే అంగన్‌వాడీలను కదిలించడానికి ఏ రాజకీయ నాయకుడైన భయపడతారని, అందువల్ల యూనియన్‌ని ఇంకా బలోపేతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు, సెక్టార్ లీడర్లు నిర్మల, సాయికుమారి, మాధవి, అనిత, ధనలక్ష్మి, మంగమ్మ, రమాదేవి, సావిత్రి, ప్రమీల పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని డిమాండ్

తాడేపల్లిరూరల్ : కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ ఇసుక దొరక్క భవననిర్మాణ కార్మికులతోపాటు యజమానులు ఇబ్బందులు పడుతున్నారని, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 56 రీచ్‌లు ఉన్నాయని, వాటిలో 36 రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో సీపీఎం పట్టణ, రూరల్ కార్యదర్శులు బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొట్టె కరుణాకరరావు, వేముల దుర్గారావు, పల్లె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయికి వరాల తల్లి

భూమిని నమ్మిన భరతజాతి మనది. అలాగే రైతుని రాజుగా చెప్పుకునే సంస్కృతి మనదేశంలోనే కనపడుతుంది. అప్పటికీ–ఇప్పటికీ చాలా కుటుంబాలకు ఈ వ్యవసాయమే జీవనాధారం. అలాటి సేద్యానికి రైతన్నే ప్రధానం. సూర్యోదయ–సూర్యాస్తమయాలు రెండూ పొలంలోనే చూసే ఆ రైతన్నకు వెన్నుదన్నుగా పాలకులే కాదు తాను ఉంటానంటూ ప్రతినబూనింది నాదెండ్ల మండలానికి చెందిన డాక్టర్ వజ్జా వరలక్ష్మి. వ్యవసాయ క్షేత్రంలోకి ఎన్నో ఆధునిక పరికరాలను ప్రవేశపెట్టి రైతన్న మంచి దిగుబడులు సాధించేలా తనవంతు ప్రయత్నం చేసి సఫలీకృతురాలైంది. ఆమె చేసిన అధ్యయనాలు, ఎన్నో పరిశోధనలకు అవార్డులు వరించాయి. తెలంగాణ ప్రభుత్వం టెక్‌శ్రీ అవార్డుతో సత్కరించింది.

- డాక్టర్ వజ్జా వరలక్ష్మికి అవార్డుల పంట
- వ్యవసాయంలో ఆధునిక పరికరాలపై పరిశోధనకు టెక్‌శ్రీ అవార్డు
- ఇప్పటికే పలు అధ్యయనాలకు నాలుగు అవార్డులు


టెక్‌శ్రీ అవార్డు అందుకుంటున్న డాక్టర్ వరలక్ష్మి

నాదెండ్ల: వ్యవసాయంలో ఆధునిక పరికరాలను రైతులకు పరిచయం చేసి, వాటి వినియోగంతో అత్యధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించిన రీసెర్చ్ రీడర్ డాక్టర్ వజ్జా వరలక్ష్మికి తెలంగాణ ప్రభుత్వం టెక్‌శ్రీ అవార్డుతో సత్కరించింది. మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన వజ్జా వరలక్ష్మి కొన్నేళ్లుగా హైదరాబాద్‌లోని లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రీసెర్చ్ రీడర్‌గా పనిచేస్తోంది. ఆమె తెలంగాణలోని వరంగల్ జిల్లాలో కొన్ని వెనుకబడిన గ్రామాలను దత్తత తీసుకుంది. డీఆర్‌డీఏ నిధులతో ఆయా గ్రామాల్లో వ్యవసాయ ఆధునిక పరికరాలను తెప్పించి రైతులను ప్రోత్సహించింది. ఆయా రైతులకు పంటల సాగులో ఆధునిక పద్ధతులను వివరిస్తూ వెన్నుదన్నుగా నిలవటంతో మంచి దిగుబడులు సాధించారు. ఈ విషయాన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ టెక్‌శ్రీ అవార్డును వరలక్ష్మికి అందించింది. ఈ సందర్భంగా డాక్టర్ వజ్జా వరలక్ష్మి మాట్లాడుతూ తాను నాలుగు పర్యాయాలు అవార్డులు అందుకున్నానన్నారు. 2017లో వాతావరణ మార్పుల ప్రభావం భూగర్భ జలాలపై ఏవిధంగా ఉండనుందనే అంశంపై నిర్వహించిన రీసెర్చ్‌లో బెస్ట్ టీచర్, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్‌లో ఐఆర్‌డీపీ అవార్డును అప్పటి మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.రాజేశ్వరన్ చేతుల మీదుగా అందుకున్నారు. 2004లో ఎంఎస్‌సీ హైడ్రాలజీ విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ మొదటి ర్యాంకు వచ్చినందుకు డాక్టర్ కేవీఎల్‌రావు మెమోరియల్ అవార్డు, జీఎల్ఎల్ సాఫ్ట్‌వేర్ కనుగొన్నందుకు 2007లో డాక్టర్ ఎస్సీ పురానిక్ యంగ్ సైంటిస్ట్ అవార్డు, 2009లో నాగార్జున సాగర్ కాలువలకు వదిలిన నీటిలో వృధాశాతంపై అధ్యయనానికి గాను రెండోదఫా ఎస్సీ పురానిక్ యంగ్ సైంటిస్ట్ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. డాక్టర్ వరలక్ష్మి తండ్రి వజ్జా లక్ష్మీకోటి బీఎస్ఎన్ఎల్‌లో పనిచేసి రిటైరయ్యారు. తల్లి గృహిణి కాగా, సోదరుడు ప్రసాద్ రైల్వేలో కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. సోదరి మాధవి చందవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. డాక్టర్ వరలక్ష్మికి అవార్డులు రావటంపై కుటుంబ సభ్యులతో పాటూ గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.